సాక్షి కర్నూలు

శుక్రవారం, 13, అక్టోబర్, 2023



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి త్రయోదశి సందర్భంగా గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధికి గుంటూరుకు చెందిన బండారు సురేష్ రూ.1,01,116 గురువారం విరాళంగా అందజేశారు.



పల్లెలకూ ఇక 'జన ఔషధి'

గ్రామీణ ప్రాంతాల్లోనూ జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందు కోసం 12 పీహెచ్‌సీలను ఎంపిక చేసింది. 8లో▸

న్యూస్‌రీల్

శ్రీమఠంలో భక్తుల సందడి



శ్రీమఠం ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ సేవలో తరించారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం దర్శనం చేసుకున్నారు. శ్రీమఠం అధికారులు ఊంజల మంటపంలో రాఘవేంద్రుల బృందావన సేవ నిర్వహించారు. శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొదుపు మహిళలకు పెరటికోళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధుల అభివృద్ధికి 2,500 పెరటి కోళ్ల యూనిట్‌లు పంపిణీ చేయనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. ఇప్పటి వరకు కల్లూరు, దేవనకొండ, మద్దికెర, వెల్దుర్తి, క్రిష్ణగిరి, ఎమ్మిగనూరు, సి.బెళగల్, గూడూరు మండలాల్లో 690 యూనిట్లు పంపిణీ చేశామన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమిళనాడు నుంచి అసిల్ క్రాస్ రకం నాటు కోళ్లు తెప్పించి పంపిణీ చేస్తున్నామన్నారు. యూనిట్‌లో కిలో బరువున్న 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయని, పెట్టలు ఏడాదికి 100 నుంచి 120 వరకు గ్రుడ్లు ఉత్పత్తి చేయడంతో పాటు మాంసానికి కూడా ఉపయోగపడుతాయన్నారు. యూనిట్ కాస్ట్ రూ.3,250 ఉంటుందని, 11 కోళ్లతో పాటు మూడు రకాల మందులు కూడా ఇస్తామన్నారు.

నేడు గోనెగండ్లలో 'జగనన్నకు చెబుదాం-స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని ఈ శుక్రవారం గోనెగండ్లలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు (సెంట్రల్): వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా చిరు, తృణ ధాన్యాల సాగుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జాతీయ రహదారుల కోసం అవసరమైన భూమిని త్వరగా గుర్తించి అప్పగించాలని సూచించారు. పెండింగ్‌లోని ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ-క్రాప్ ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతోందని, పంటలు వేసిన రైతులందరితో శుక్రవారం సాయంత్రం లోపు ఈ-కేవైసీ చేయించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ ఆఫీస్ నుంచి కలెక్టర్ డాక్టర్ సృజన, కలెక్టరేట్ నుంచి జేసీ నారపురెడ్డి మౌర్య, సీపీఓ అప్పలకొండ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కూడా ఈ-కేవైసీకి అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు శుక్రవారం చివరి రోజు ఈ-కేవైసీ నమోదు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఖరీఫ్ పంటల నమోదు ఈ నెల 9తోనే ముగిసింది. ప్రస్తుతం రైతులతో ఈ-కేవైసీ చేయించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఈ-క్రాప్‌లో 10,09,865 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేశారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 3,13,926 మంది రైతులు 9,38,181 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ధ్రువీకరిస్తూ ఈ-కేవైసీ చేయించుకున్నారు. మిగిలిన రైతులు ఈ నెల 13 సాయంత్రం 6 గంటల్లోపు ఆర్‌బీకేల్లో బయోమెట్రిక్ వేయడం ద్వారా లేదా ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేయించుకునే అవకాశం కల్పించారు.

స్వగృహ సౌభాగ్యం

- పండుగలా ఓర్వకల్లులో జగనన్న కాలనీ ప్రారంభోత్సవం
- పచ్చ తోరణాలు, పాల పొంగుల మధ్య ఇళ్లలో అడుగు పెట్టిన లబ్ధిదారులు
- ఆహ్లాదకర వాతావరణం, ఆధునిక హంగులతో గేటెడ్ కమ్యూనిటీని తలపిస్తున్న కాలనీ
- పేదలను సొంతింటి యజమానుల్ని చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మొక్కుబడిగా స్థలం కేటాయించకుండా సకల సౌకర్యాల కల్పన: జిల్లా కలెక్టర్ సృజన
- పేదలు సొంతింట్లో సంతోషంగా ఉండాలన్నదే సీఎం తపన: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

స్వప్నం సాకారమైంది.. గూడు లేక నైరాశ్యంలో మగ్గుతున్న నిరుపేదలకు అందమైన ఇల్లు సొంతమైంది. నయాపైసా ఖర్చు లేకుండా ఆధునిక హంగులతో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కాలనీలను కట్టించింది. వాటిని నిరుపేదలకు కట్టబెట్టి ప్రజాప్రభుత్వం అన్న పదానికి అసలైన నిర్వచనం చెప్పింది. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో కాకుండా ఏకంగా 40వ నంబరు జాతీయ రహదారి పక్కన సెంటు లక్షల్లో విలువ చేసే జాగాలను కేటాయించటంతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో ఇళ్లు కట్టించి గురువారం గృహ ప్రవేశం చేయించింది.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యే కాటసాని తదితరులు



లబ్ధిదారురాలు పద్మావతితో గృహ ప్రవేశం చేయిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



హాజరైన లబ్ధిదారులు

గడివేముల: మండల కేంద్రమైన ఓర్వకల్లుకు సమీపంలో గురువారం వైఎస్సార్ జగనన్న కాలనీ ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కాలనీ ముఖద్వారాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. అలాగే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా కాలనీని ప్రారంభించారు. అనంతరం కాలనీలో లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన మాట్లాడుతూ.. ధనవంతులకు ఏ మాత్రం తగ్గకుండా పేదల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో 40 వేల ఇళ్లకు గాను నేడు 17 వేల ఇళ్ల ప్రారంభం కావటం సంతోషకరమన్నారు. విలువైన స్థలంతో కూడిన ఇంటిని మహిళల పేరిట ఇవ్వటం అభినందించదగ్గ విషయమన్నారు. ఓర్వకల్లులో 72 ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయించినట్లు చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో, అన్ని వసతులు ఉన్న ప్రదేశంలో ఏర్పాటైన ఓర్వకల్లు జగనన్న కాలనీ జిల్లాకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

➤ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. దళారుల ప్రమేయం లేకుండా, నయాపైసా ఖర్చు లేకుండా సొంతింటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రికి రుణపడి ఉండాలన్నారు. టీడీపీ హయాంలో పేదలకు ఇంటిస్థలం, ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. అర్హత ఉంటే పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో నిరుపేద అక్కచెల్లెమ్మల పేరునే ఇంటి పట్టాలను ఇస్తున్నామన్నారు.

➤ కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఇంటింటికీ మంచినీరు అందిస్తోందన్నారు. ఉచితంగా విద్యుత్ మీటర్లు అమర్చిందన్నారు. రోడ్లు, విద్యుత్, ఇతర సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాబోయే రోజుల్లో ఇళ్లు కట్టిస్తామన్నారు.

➤ ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవారికి సొంత ఇంటికలను సాకారం చేశారన్నారు. ఈ క్రమంలో ఇళ్లు కాదు...ఊళ్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతికేలా పాలన సాగిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కాలనీని చూస్తుంటే పట్టణాల్లోని టౌన్‌షిప్ గుర్తుకు వస్తోందన్నారు.

➤ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలు సొంతింట్లో సుఖ సంతోషాలతో జీవించాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. ఓర్వకల్లులో ఇంత విలువైన ప్రదేశంలో చక్కని ఇళ్ల నిర్మాణం జరిగినందుకు సంతోషంగా ఉందన్నారు. తన రాజకీయ జీవితంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినంత మేలు ఎన్నడూ చూడలేదన్నారు.

చాలా సంతోషంగా ఉంది

మేం 13 ఏళ్లు అద్దె ఇంటిలో చాలా ఇబ్బందులు పడ్డాం. ఇంటి కోసం నేను కార్యాలయాల చుట్టూ తిరగలేదు. గ్రామ వలంటీరు మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లాడు. వెంటనే ఇంటిపట్టా మంజూరైంది. ప్రభుత్వమే ఇల్లు కూడా సకల సౌకర్యాలతో నిర్మించి ఇచ్చింది. చాలా సంతోషంగా ఉంది. సీఎంకు రుణపడి ఉంటాం.

– పద్మావతి

ఊహించలేదు



నిరుపేదలమైన మేం సొంతంగా ఇంటి స్థలం సంపాదించుకోగలమని కలలో కూడా అనుకోలేదు. మా ఆశల్ని నెరవేరుస్తూ నా పేరుపైనే స్థలం ఇవ్వటంతో పాటు నాణ్యతలో రాజీ పడకుండా ఇల్లు కట్టించి ఇచ్చారు. ఇంత కన్నా మంచి చేసే ప్రభుత్వం ఇంకొకటి ఉండదు. చివరి వరకూ జగనన్నతోనే ఉండి ఆయన రుణం తీర్చుకుంటాం.

– శిల్ప

ఈరోజు మాకు పండగ రోజు



జగనన్న కాలనీ ఊరిని తలపిస్తోంది. చాలామంది సొంతిల్లు కట్టుకుని గృహ ప్రవేశాలు చేయటంతో పండగలా అనిపిస్తోంది. కొన్ని ఏళ్లుగా ఇంటి స్థలాలు, నిర్మాణాలపై ఇతర పార్టీలు ఊదరగొట్టడమే తప్ప పంచింది లేదు. ప్రస్తుత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలం కేటాయించి, వెంటనే ఇల్లు నిర్మించి ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు. పాలు పొంగించి ఇంటిలో చేరాను. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాను.

– అల్లసాని

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే పాణ్యం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చటంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు.

పండుగలా గృహప్రవేశాలు

పచ్చ తోరణాలతో అలంకరించిన ఇళ్లలో లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు గృహ ప్రవేశం చేయించారు. పాలపొంగుల మధ్య సొంతిళ్లలో అడుగు పెట్టిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. తరలివచ్చిన బంధువులతో ఓర్వకల్లు సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్లు సౌకర్యంగా ఉన్నాయా లేదా అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మహిళల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడ్, ఎంపీపీ తిప్పన్న, ఉప సర్పంచ్ నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ జఫరున్నిసా బేగం, హౌసింగ్ పీడీ సిద్ధ లింగమూర్తి, తహసీల్దారు శివప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ తిరుపాలు, శంకరరెడ్డి, శేఖర్‌రెడ్డి, కాంతారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఖరీఫ్ పంటల స్థితిగతులపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. పంటల సాగు విస్తీర్ణం, రిమోట్ సెన్సింగ్ డేటా, తేమ శాతం, భూగర్భ జలాలు(హైడ్రాలజీ), వర్షపాతం(రెయిన్‌ఫాల్), మండలాల వారీగా పంట సాధారణ దిగుబడులు, వాస్తవంగా వచ్చే దిగుబడులు తదితర వివరాలపై ప్రభుత్వం ఇటీవల నివేదిక కోరింది. ఆ మేరకు జిల్లా యంత్రాంగం స్పందించింది. ఖరీఫ్ సాధారణ సాగు 10.42 లక్షల ఎకరాలు ఉండగా ఈ-క్రాప్ ప్రకారం 10.09 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ● ఖరీఫ్ సీజన్ అంటే జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం 401.1 మి.మీ ఉండగా 329.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

● జూన్ నెలలో 40 శాతం లోటు, జూలైలో 64 శాతం ఎక్సెస్, ఆగస్టులో 75 శాతం లోటు, సెప్టెంబర్ నెలలో 10 శాతం లోటు వర్షపాతం ఉంది.

● జూలై నెల మినహా మిగిలిన మూడు నెలల్లో వర్షాలు నిరాశజనకం. ● ఖరీఫ్ పంట దిగుబడులు సాధారణ దిగుబడులతో పోలిస్తే 60 నుంచి 80 శాతం వరకు పడిపోయినట్లు జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. ● ఉదాహరణకు పత్తి ఎకరాకు సాధారణ దిగుబడి 5 క్వింటాళ్లు ఉండగా 2 క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్లు స్పష్టమవుతోంది.

● వేరుశనగ సాధారణ దిగుబడి 8 క్వింటాళ్లు ఉండగా. 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు జిల్లా యంత్రాంగం నిర్ధారించింది.

● భూగర్భ జలాల పరిస్థితి కూడా నిరాశాజనకంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.17 కోట్లు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉభయ దేవాలయాల హుండీలను గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు మాట్లాడుతూ స్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాల హుండీల ద్వారా రూ.3,17,50,290 లభించినట్లు తెలిపారు. అలాగే 187 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారం, 6 కేజీల 340 గ్రాముల వెండితో పాటు కొంత విదేశీ కరెన్సీ కూడా లెక్కింపులో లభించాయన్నారు. లెక్కింపులో దేవస్థానం అన్ని శాఖల ఉద్యోగులు, శివసేవకులు పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహణ
- రోజూ అమ్మవారికి విశేష అలంకరణ, స్వామిఅమ్మవార్లకు వాహన సేవ
- 23న రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాల సమర్పణ
- శ్రీశైల దేవస్థానం ఈఓ డి. పెద్దిరాజు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబాదేవి శరన్నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. గురువారం దేవస్థాన పరిపాలనా భవనంలోని సమీక్ష సమావేశ మందిరంలో దసరా నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. దసరా మహోత్సవాల నిర్వహణకు చేపట్టిన ఆయా ఏర్పాట్లను ఈఓ వివరించారు. ఉత్సవాల్లో స్వామిఅమ్మవార్లకు జరిపించాల్సిన ఆయా కైంకర్యాలు, అలంకరణ, వాహనసేవలు, వాహనాల పార్కింగ్, దర్శనం ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ మొదలైన అంశాల గురించి సమీక్షించారు. ముఖ్యంగా ఉత్సవ రోజుల్లో స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరిపించాలని, వైదిక కార్యక్రమాల నిర్వహణలో సమయ పాలన కచ్చితంగా పాటించాలని వైదిక సిబ్బందికి సూచించినట్లు ఈవో తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు స్వామివారికి విశేష అర్చనలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, రుద్రయాగం, చండీయాగం, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గల అలంకరణలు, స్వామిఅమ్మవార్లకు వివిధ వాహన సేవలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఈనెల 23న రాష్ట్ర ప్రభుత్వంచే స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని, 24న యాగపూర్ణాహుతి, కలశోధ్వాసన, అవభృదం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మహోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ నజీర్, మంత్రులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించామన్నారు. భక్తులు ఉత్సవాలను వీక్షించేలా ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామన్నారు.

ఉత్సవాల నిర్వహణ ఇలా..

తేదీ	అలంకరణ	వాహన సేవలు
15న	శైలపుత్రి	భృంగివాహనం
16న	బ్రహ్మచారిణి	మయూరవాహనం
17న	చంద్రఘంట	రావణవాహనం
18న	కూష్మాండదుర్గ	కైలాసవాహనం
19న	స్కందమాత	శేషవాహనం
20న	కాత్యాయని	హంసవాహనం, పుష్పపల్లకీసేవ
21న	కాళరాత్రి	గజవాహనం
22న	మహాగౌరి	నందివాహనం
23న	సిద్ధిదాయిని	అశ్వవాహనం
24న	భ్రమరాంబాదేవి (నిజరూపం)	నందివాహనం (ఆలయ ఉత్సవం)

కాలిపోతే.. కష్టం లేకుండా మార్పు!

- ట్రాన్స్ 'ఫార్మర్' కష్టాలను తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం
- మూడేళ్లలో 8,596 ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు
- వీటిలో అధిక శాతం వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లే
- ఇబ్బందులు ఉంటే 1912 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు



పొలం ఎండిపోకుండా కాపాడారు

ఈ చిత్రంలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కన నిల్చున్న రైతు పేరు ఖమ్రుద్దీన్. కర్నూలు మండలం మిలటరీ కాలనీ వాసి. బోరు కింద పొలంలో వివిధ పంటలు సాగు చేశాడు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం మోటారుకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ విషయాన్ని వెంటనే లైన్‌మ్యాన్‌కి చెప్పి, అతని ద్వారా ఏఈ దృష్టికి తీసుకెళ్లాడు. దీనిపై స్పందించిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్‌ను ఆన్‌లైన్ నమోదు చేసి, మరొకటి మంజూరు చేశారు. బుధవారం మధ్యాహ్నం (48గంటల్లో) కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి, దాని స్థానంలో మరొకటి అమర్చారు. నిబంధన పక్కాగా అమలు చేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ మార్చడంతో తన పొలం ఎండిపోకుండా కాపాడారని రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

కర్నూలు(రాజ్‌విహార్): వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కీలకమైన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఒకప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 10–15 రోజులైనా వచ్చేది కాదు. కానీ ఇప్పుడు అలా కాదు.. ఫిర్యాదు వచ్చిన రెండు రోజుల్లోనే మార్చేసి, కొత్తది ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పక్కాగా అమలు చేస్తూ, దీనిపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపిన ఎమ్మిగనూరు రూరల్ ఏఈ సునీల్‌కుమార్‌ను ఇటీవలే సస్పెండ్ చేస్తూ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో మిగిలిన ఏఈలు అప్రమత్తమయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినట్లు ధ్రువీకరణ జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వెంటనే మంజూరు చేయడంతో పాటు 48గంటల్లోపు లోపు మారుస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లలో మొత్తం 9,544 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా వాటిలో 8,596 (90శాతం) నిర్ణీత గడువులోపు మార్చారు. మిగిలిన 10 శాతం సాంకేతిక, ఇతర సమస్యలతో కాస్త జాప్యం జరిగినట్లు అధికారులు చెప్పారు.

నిబంధనలు ఇలా...

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే వినియోగదారుడు వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదైతే విద్యుత్ సిబ్బంది పాత ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి, రోలింగ్‌లో ఉన్న దానిని తెచ్చి అమర్చుతారు. విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 48 పని గంటల్లోపు, పట్టణాల్లో 24 గంటల్లోపు సంస్థ వాహనంలోనే తెచ్చి అమర్చాలి. దీనికి రవాణా, మరమ్మతు, ఇతర ఎలాంటి రుసుం వసూలు చేయకూడదు.

మరమ్మతు కేంద్రాలు

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చి వాటిని రిపేరు చేసేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కర్నూలులో 2, నందికొట్కూరులో 1, డోన్‌లో 1, ఆదోనిలో 1. ఎమ్మిగనూరులో 1, పత్తికొండలో 1, నంద్యాలలో 2, ఆళ్లగడ్డలో 1 బనగానపల్లెలో 1, కోవెలకుంట్లలో 1 చొప్పున ఉన్నాయి. వీటిని ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి.

జాప్యం జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు

రైతులు, వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకునేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ టోల్ ఫ్రీ (ఉచిత) నంబర్ 1912ను తెచ్చింది. తిరుపతిలోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పనిచేస్తుంది. ఉమ్మడి (కర్నూలు, నంద్యాల) జిల్లాల ప్రజలు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడంలో ఇబ్బందులు ఎదురైతే నేరుగా ఆ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. దీనితో పాటు విద్యుత్ బ్రేక్ డౌన్లు, ఫీడర్ ట్రిప్పింగ్స్, ఇతర అంతరాయ సమస్యలనూ చెప్పుకోవచ్చు. వాటిని కాల్ సెంటర్ ఉద్యోగి ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సమస్యను సంబంధిత ఆపరేషన్స్ ఎస్‌ఈ నుంచి ఏఈ వరకు పంపుతారు. సమస్య నమోదు మొదలు పరిష్కారం వరకు అన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో నిర్ణీత గడువులోపు పనులు జరుగుతాయి. లేదా సంబంధిత లైన్‌మెన్/ఏఈకి సమాచారం ఇచ్చినా స్పందించి మరొకటి అమర్చుతారు.

మార్చిన కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు సంవత్సరాల వారీగా..

డివిజన్ పేరు	2020	2021	2022–23
కర్నూలు	189	140	139
కర్నూలు రూరల్	355	385	444
నంద్యాల	1,246	1,323	1,015
డోన్	405	410	413
ఆదోని	979	1,087	1,014
మొత్తం	3,174	3,345	3,025

48గంటల్లోపు మార్పు



రైతు సమస్యలు, అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే 48 గంటల్లోపు, పట్టణాల్లో 24 గంటల్లోపు మార్చి, కొత్తది ఏర్పాటు చేస్తున్నాం. కాలిపోయిందని నిర్ధారణ అయిన వెంటనే 1912 నంబర్‌కు లేదంటే లైన్‌మ్యాన్‌కు, ఏఈకి చెప్పాలి. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోపు కొత్తది తెచ్చి ఉచితంగానే ఏర్పాటు చేస్తారు. ఎవరైనా డబ్బు అడిగితే 1912 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. జిల్లా స్టోర్స్, ఎస్పీఎం కేంద్రాల్లో రోలింగ్ ట్రాన్స్‌ఫార్మర్లు తగినన్ని సిద్ధంగా ఉన్నాయి. ఎక్కడా కొరత లేదు.

– ఎం. ఉమాపతి, కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ

క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్ల కోసం లీగల్ కేర్ సెంటర్

కర్నూలు(లీగల్): ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్ల కోసం వన్‌స్టాప్ సెంటర్‌లో విలేజ్ లీగల్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ ప్రారంభించామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్. వెంకటనాగ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో పి.శివసుదర్శన్‌ను ప్యానెల్ లాయర్‌గా నియమించినట్లు చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో గురువారం ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్ల కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సపోర్టు సెంటర్‌లో నెలలో రెండుసార్లు ట్రాన్స్‌జెండర్ల అసౌకర్యాలు, నష్టపరిహారం, సేవా లోపాలు ఉంటే చర్చించి పరిష్కరిస్తారన్నారు. అదే విధంగా తగిన న్యాయసహాయం అందజేస్తారని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన, అవసరమైన న్యాయ సహాయం కూడా అందజేస్తామని చెప్పారు.

ఇద్దరు క్రికెట్ బుకీల అరెస్ట్

పత్తికొండ టౌన్: పట్టణంలో ఇద్దరు క్రికెట్ బుకీలను అరెస్ట్ చేసినట్లు సీఐ మురళీమోహన్ గురువారం విలేకరులకు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో గురువారం పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించారన్నారు. పత్తికొండ పట్టణం కోయనగర్‌కు చెందిన కొండపల్లి మారెన్న, ఆదోని కార్వన్‌పేట వలీబాషాలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1.85లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, 20 తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని పత్తికొండ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


కర్నూలు(టౌన్): ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. బళ్లారి చౌరస్తా సమీపంలోని బృందావన్ కాలనీకి చెందిన మానపాటి నాగిరెడ్డి(28) బుధవారం రాత్రి 2 గంటల సమయంలో ఇంటి పక్కనున్న తెలిసినవారి బైక్ (ఏపీ21 ఏజే 6403)పై నంద్యాల చెక్‌పోస్టుకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో స్థానిక కిసాన్‌ఘాట్ వద్ద బైకు అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యచికిత్సల అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మరణించాడు. మృతుని తల్లి మానపాటి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

మహానందీశ్వరాలయానికి ఇత్తడి ద్వారాలు

మహానంది: ఆలయ ప్రధాన ప్రవేశద్వారం వద్ద ఉన్న పాత ద్వారాలను తొలగించి వాటి స్థానంలో నూతనంగా తయారు చేయించిన ఇత్తడి ద్వారాలను గురువారం ఏర్పాటు చేశారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. సాంబవరం గ్రామానికి చెందిన శివశంకర్, కల్లుపల్లి గ్రామానికి చెందిన గోవిందనాయుడు, సుందరమ్మ, జ్యోతీశ్వర్ రూ. 6లక్షలతో ఇత్తడి ద్వారాలను చేయించారు.

పల్లెల్లోనూ జన ఔషధి కేంద్రాలు

- సహకార సంఘాల్లో ఏర్పాటుకు చర్యలు
- కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 5 చొప్పున ఏర్పాటు
- ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లైసెన్స్‌ల జారీ పూర్తి
- స్టోర్ కోడ్‌ల కోసం ప్రతిపాదనలు
- 80 శాతం తక్కువ ధరకే అందనున్న జనరిక్ మందులు


జనరిక్ మందులు


సీ.బెళగల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణ ప్రాంతాల్లోనూ జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందు కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)ను ఎంపిక చేసింది. దీంతో పల్లె ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులు అందనున్నాయి. మొదటి విడతలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 సహకార సంఘాలు, ఒక సహకార మార్కెటింగ్ సొసైటీలో మొత్తంగా 13 ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. నవంబరు నెలలో వీటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో వీటిని పీఏసీఎస్‌ల్లోనే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది.

80 శాతం తక్కువ ధరకే..

ప్రస్తుతం మార్కెట్‌లో లభించే మందుల ధరలతో పోలిస్తే ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల్లో 80 శాతం తక్కువ ధరకే లభిస్తాయి. ఉదాహరణకు ఒక బీపీ మాత్ర ధర రూ.5 ఉంటే జనరిక్ బీపీ మాత్ర రూ.1కే లభిస్తుంది. జనరిక్ మందులు సమర్థవంతంగా పనిచేస్తాయి. పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసే ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల్లో అన్ని రకాల మందులు లభిస్తాయి. ప్రభుత్వం ఆసుపత్రుల్లో కూడా డాక్టర్లు జనరిక్ మందులే రాసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వ్యాధులను నివారించుకోవడంలో మందులపై ఖర్చు తడిచి మోపెడవుతున్న నేపథ్యంలో తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ అంటే..

పీఏసీఎస్‌లను బహుళ సేవా కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే పీఏసీఎస్‌ల్లో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు పీఏసీఎస్‌లు, కర్నూలు డీసీఎంఎస్‌తో కలిపి ఎనిమిది ఏర్పాటు కానున్నాయి. సి.బెళగల్, హొళగుంద, ఓర్వకల్లు, కౌతాళం, పెద్దకడుబూరు, మద్దికెర, మదిర పీఏసీఎస్‌లతో పాటు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. నంద్యాల జిల్లాలో నందికొట్కూరు, దొర్నిపాడు మండలంలోని గుండుపాపల, నంద్యాల మండలంలోని పోలూరు, ఆళ్లగడ్డ, కొత్తపల్లి మండలంలోని నాగంపల్లి సహకార సంఘాల్లో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. మరిన్ని సొసైటీలు జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తున్నాయి. వీటిల్లో రెండో విడతలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లైసెన్స్‌ల జారీ ప్రక్రియ కూడా పూర్తి అయింది. స్టోర్ కోడ్‌లకు ప్రతిపాదనలు పంపారు. స్టోర్ కోడ్‌లు వస్తే జన ఔషధి కేంద్రాలు కార్యరూపం దాలుస్తాయని సహకార శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

శుభపరిణామం



ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశం. ఇందులో భాగంగా పీఏసీఎస్‌లకు షాపింగ్ కాంప్లెక్స్‌లు, కమ్యూనిటీ హాల్స్, గోదాములు వంటి వాటిని మంజూరు చేస్తోంది. తాజాగా ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను కూడా పీఏసీఎస్‌ల్లో ఏర్పాటు చేస్తుండటం శుభపరిణామం. మా సొసైటీలో జన ఔషధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లైసెన్స్ జారీ పూర్తి అయింది. స్టోర్ కోడ్ కోసం ప్రతిపాదనలు పంపాం. కోడ్ వస్తే ప్రారంభించేందుకు సిద్ధం ఉన్నాము. – రవికుమార్‌రెడ్డి, సీఇవో, సీ.బెళగల్ పీఏసీఎస్

వచ్చే నెలలో అందుబాటులోకి



జిల్లాలో మొదటి విడతలో 8 ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో 7 పీఏసీఎస్‌లు, ఒకటి డీసీఎంఎస్‌లో ఏర్పాటు కానుంది. మరికొన్ని సొసైటీలు కూడా ముందుకు వస్తున్నాయి. వీటిని రాష్ట్రంలో సహకార రంగంలోనే ప్రారంభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిపై ఇప్పటికే సొసైటీ సీఇవోలకు అవగాహన కల్పించాం. వచ్చే నెలలో ఇవి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. – ఎస్.రామాంజనేయులు, కర్నూలు జిల్లా సహకార అధికారి

ఘనంగా ఎల్లార్తి ఉరుసు


షేక్షావలి దర్గాకు తరలి వచ్చిన భక్తులు


దర్గాకు గంధాన్ని మోసుకొస్తున్న పూర్వ ముతవల్లి నూర్‌బాబా

- గంధం మోసిన పూర్వ ముతవల్లి నూర్‌బాబా

హొళగుంద: ఎల్లార్తిలో గురువారం షేక్షావలి, షాషావలి తాతల ఉరుసును ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను తిలకించడానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. తాతల సమాధులను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారు జామున పూర్వ ముతవల్లి నూర్‌బాబా గంధాన్ని గ్రామ వీధుల గుండా వేడుకగా తీసుకొచ్చారు. ఈ సమయంలో భక్తులు ప్రదర్శించిన కర్రసాము విన్యాసాలు, ఇతర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులను ఆశీర్వదించిన అనంతరం నూర్‌బాబా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకుని ప్రశాంత జీవితం గడపాలన్నారు. దర్గా నిర్వాహకులు, వక్ఫ్‌బోర్డు ఆదోని డివిజన్ ఆడిటర్ మహమ్మద్ అలీసా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఈ–కేవైసీ వంద శాతం పూర్తవ్వాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): శుక్రవారం సాయంత్రంలోపు వంద శాతం రైతులతో ఈ–కేవైసీ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనగ విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేలలో ఆధార్ కార్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రీసర్వేకు సంబంధించి ఇంకా 5,707 సరిహద్దు రాళ్లను నాటాల్సి ఉందని.. వెనుకంజలో ఉన్న సి.బెళగల్, ఉయ్యాలవాడ మండలాల్లో పనులను వేగవంతం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీలకు సంబంధించి అక్నాలెడ్జ్‌మెంట్ కాపీలను అర్జీదారులకు అందజేయాలన్నారు. ఆదోని, కర్నూలులో జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీల ఏర్పాటుకు 15 సెంట్ల అనువైన స్థలాలను గుర్తించాలని, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాదును ఆదేశించారు. అనంతరం డీఆర్వో కె.మధుసూదనరావు మాట్లాడుతూ మండలస్థాయిలో ప్రతి మంగళవారం తహసీల్దార్లు సమీక్షలు నిర్వహించుకొని మినిట్స్‌ను తమకు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ నాగప్రసన్న లక్ష్మీ, డీపీఓ నాగరాజునాయుడు, సర్వే ఏడీ మునికన్నన్, డీఎల్‌పీఓ నూర్జహాన్, సర్వే అధికారి విజయసారథి పాల్గొన్నారు.

డీసీసీబీకి జాతీయ స్థాయి అవార్డు


గోవాలో అవార్డు అందుకుంటున్న డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి, సీఈఓ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. గోవాలో జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకుకు ఫ్రాంటైస్(frontierr) కో–ఆపరేటివ్ బ్యాంక్ అవార్డు(ఎఫ్‌సీబీఏ) లభించింది. గోవా సహకార మంత్రి శిరోట్కర్ చేతుల మీదుగా చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు ఈ అవార్డును అందుకున్నారు. గోవాలో నేషనల్ కో–ఆపరేటివ్ బ్యాంకింగ్ సమ్మిట్ పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇందులో కర్నూలు డీసీసీబీ ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 36 ఏళ్లుగా నష్టాల్లో ఉన్న డీసీసీబీ లాభాల్లోకి రావడానికి దారితీసిన పరిస్థితులను చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, సీఈఓ పి.రామాంజనేయులు వివరించారు. ఈ మేరకు బ్యాంకుకు ఎఫ్‌సీబీఏ లభించింది.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు పదేళ్ల జైలు

కర్నూలు(లీగల్): ప్రేమించి కులాంతర వివాహం చేసుకుని కొద్ది రోజులకే భార్యను మానసికంగా, శారీరకంగా వేధించి మృతికి కారణమైన భర్తకు 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కర్నూలు ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక విచారణ న్యాయస్థానం గురువారం తీర్పు చెప్పింది. కేసు వివరాలు.. ఎమ్మిగనూరు పట్టణంలోని కడిమెట్ల రోడ్డులో నివాసం ఉండే కె.మీనాక్షి ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గొల్ల రాజును ప్రేమించి పెళ్లి చేసుకుంది. మీనాక్షి టీటీసీ పూర్తి చేసినందున, దివ్యాంగురాలిగా ఉన్నందున సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయునిగా మంత్రాలయం మండలం తుంగభద్రలో పనిచేసేది. పెళ్లి జరిగిన కొద్ది కాలానికే మీనాక్షి భర్త గొల్ల రాజు, వారి కుటుంబ సభ్యులు కట్నం కావాలంటూ వేధిస్తున్నారని తన కుటుంబ సభ్యులకు చెప్పింది. పెద్దల సమక్షంలో కట్నం కోసం వేధించబోమని చెప్పడంతో మళ్లీ మీనాక్షి కాపురానికి వెళ్లింది. డబ్బు తెమ్మంటే పంచాయితీ పెట్టిస్తావా అంటూ భర్త రాజు కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా వేధించినట్లు తన తల్లికి సోదరుడితో చెప్పి బాధ పడింది. 2016 సంవత్సరం ఏప్రిల్ 28న సాయంత్రం 7 గంటలకు మీనాక్షి సోదరుడు వెంకటేష్ ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో అనుమానంతో చెల్లెలు ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. తన చెల్లెలు మృతికి ఆమె భర్త రాజు కుటుంబ సభ్యులు నలుగురు కారణమని ఎమ్మిగనూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతురాలు ఎస్సీ సామాజిక వర్గం కావడంతో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, 304(బి) ఐపీసీ ఆర్/డబ్ల్యూ 34గా కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులపై అప్పటి ఆదోని డీఎస్పీ కొల్లి శ్రీనివాసరావు అభియోగపత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో మీనాక్షి భర్త గొల్ల రాజుపై మాత్రమే నేరం రుజువు కావడంతో పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మిగతా కుటుంబ సభ్యులపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి పి.పాండురంగారెడ్డి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.స్వాములు వాదించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 13న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలను గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు.

మండలం/పట్టణం	వైద్యశిబిరం
ఎమ్మిగనూరు	గుడేకల్–1
తుగ్గలి	జొన్నగిరి–2
పెద్దకడుబూరు	గవిగట్టు
పత్తికొండ	చక్రాళ్ల
ఓర్వకల్	ఉప్పలపాడు
నందవరం	నదికైరవాడి
మంత్రాలయం	రాచుమర్రి
కర్నూలు	బండిమెట్ట
	యుపీహెచ్‌సీ
కర్నూలు	ఉల్చాల–2
క్రిష్ణగిరి	ఎస్‌హెచ్ ఎర్రగుడి
కౌతాళం	కాత్రికి
కోసిగి	కోసిగి–1
కోడుమూరు	అనుగొండ
గూడూరు	మునగాల
గోనెగండ్ల	హెచ్. కైరవాడి–2
దేవనకొండ	కప్పట్రాళ్ల
సి.బెళగల్	కొత్తకోట–1
ఆస్పరి	బనవనూరు
ఆలూరు	హోలేబీడు
ఆదోని	శరాఫ్ బజార్
	యుపీహెచ్‌సీ
ఆదోని	సాంబగల్లు

శ్రీశైలంలో 80 టీఎంసీల నీటి నిల్వలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో గురువారం సాయంత్రానికి 80.1728 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి వచ్చే వరద ప్రవాహం పూర్తిగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. బుధవారం నుంచి గురువారం వరకు జలాశయం నుంచి 26,993 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 9.577 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 19,480 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 3,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,590, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,231 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. డ్యామ్ నీటిమట్టం 850.10 అడుగులకు చేరుకుంది.

రెండు లారీలు సీజ్

కర్నూలు (న్యూసిటీ): అక్రమంగా సున్నపురాయి రవాణా చేస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి ప్యాపిలి, డోన్ దగ్గర రెండు లారీల్లో అనుమతి లేకుండా సున్నపురాయి తరలిస్తున్నారనే సమాచారంతో మైనింగ్ అధికారులు వెళ్లి తనిఖీ చేశారని ఆయన చెప్పారు. అధికారుల కళ్లుకప్పి రాత్రి సమయాల్లో సున్నపురాయిని అక్రమార్కులు రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. రాత్రులు, ఆదివారాల్లో అధికారులు అందుబాటులో ఉండరనే సమాచారంతో అక్రమార్కులు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. ఆ వాహనాల యజమానులకు రూ.60 వేలు అపరాధ రుసుం విధించామని తెలిపారు. మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా అక్రమంగా సున్నపురాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే

- విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి


పోటీలను ప్రారంభిస్తున్న కేశవరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమేనని కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత ఎన్. కేశవరెడ్డి అన్నారు. గురువారం కేశవరెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో క్రీడా మైదానంలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు కడప, ప్రొద్దుటూరు, నంద్యాల జిల్లాల నుంచి 2వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, చెస్, అథ్లెటిక్స్ తదితర పోటీలకు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ విద్యా సంస్థల్లో జోనల్ మీట్, సెంట్రల్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. గతంలో తమ సంస్థ నుంచి ఎంతో మంది జాతీయ క్రీడల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జోనల్, సెంట్రల్ మీట్ కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం


నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో మరో నూతన సేవకు శ్రీకారం చుట్టారు. మాసశివరాత్రి పురస్కరించుకుని గురువారం నూతనంగా నందీశ్వరుడికి ప్రదోష కాలంలో అభిషేక పూజలను ప్రారంభించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. నందీశ్వరాభిషేకం, నందీశ్వర పీఠార్చనలు, ప్రదోషకాల పూజలు వైభవంగా జరిపారు. నందీశ్వరస్వామికి పాలాభిషేకం, గంధాభిషేకం, విశేష ద్రవ్యాభిషేకం పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు బసిరెడ్డిగారి రామతులశమ్మ, హేమలత, గంగిశెట్టి మల్లికార్జున, బుసకాని వెంకటేశ్వర్లు, ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఇన్‌స్పెక్టర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దసరా మహోత్సవాలకు ఆహ్వానం


కర్నూలు జిల్లా జడ్జి ఎన్. శ్రీనివాసరావుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 15 నుంచి జరిగే దసరా మహోత్సవాలకు జిల్లా ఉన్నతాధికారులను ఆహ్వానించారు. గురువారం కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు, కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్‌కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్, ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావులను దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి ఐఎన్‌వీ మోహన్, తదితరులు కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారికి అర్చక వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఏఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పోలీస్ డాగ్స్‌కు బంగారు పతకాలు


జిల్లా ఎస్పీకి గౌరవవందనం చేస్తున్న పోలీస్ డాగ్స్

బొమ్మలసత్రం: ఏపీ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ 21వ మిడ్‌టౌన్ పరీక్షల్లో నంద్యాల జిల్లాకు చెందిన రెండు పోలీస్ డాగ్స్ బంగారు పతకాలను సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా దొంగతనం, హత్యలు లాంటి సంఘటనలు జరిగినప్పుడు ఈ డాగ్స్ సహాయంతో ఆధారాలు సేకరిస్తామన్నారు. ఈ డాగ్స్ విజయవాడలో పోలీస్ ఉన్నతాధికారులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనపరచడం సంతోషంగా ఉందన్నారు. వీటికి శిక్షణ ఇచ్చిన సిబ్బంది మధుసూధాకర్, స్వాములు, మహేష్‌ను అభినందిచారు.

సుబ్రమణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ.22.83 లక్షలు

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వస్వామి హుండీ ఆదాయం రూ. 22.83 లక్షలు వచ్చింది. ఆలయ ఆవరణలో గురువారం స్వామి వారి హుండీ కానుకలు నంద్యాల డివిజన్ దేవదాయశాఖ అధికారి శశికుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. రూ.22,83,805 నగదు, 689 గ్రాములు వెండి వచ్చిందని ఈఓ రామకృష్ణ తెలిపారు. ఈ ఏడాది జూన్ 30 తేదీ నుంచి ఇప్పటి వరకు భక్తులు ఈ కానుకలు సమర్పించారన్నారు. కార్యక్రమంలో క్రిష్ణారెడ్డి, బీరం శివరామిరెడ్డి, మిలటరీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.